'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి ‖ సంపుటి : 1 ‖ సంచిక : 56 ‖ శనివారం ‖ 10.10.2026 ‖ పేజీలు : 8 ‖ వెల రూ. 2

Medchal Malkajgiri ‖ Volume: 1 ‖ Issue: 56 ‖ Saturday ‖ 10.10.2026 ‖ Pages: 8 ‖ Rate: 2



## విమానాశ్రయానికి మోదీ పేరు!

### యూపీ కేబినెట్ కీలక నిర్ణయం..

**జాతీయ విమానయాన కేంద్రంగా జేవర్**

ఉత్తరప్రదేశ్‌లోని జేవర్ వద్ద నిర్మిస్తున్న నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఆమోదం లభించింది. విమానాశ్రయానికి 'నరేంద్ర మోదీ అంతర్జాతీయ విమానాశ్రయం, నోయిడా-జేవర్'గా పేరు మార్చేందుకు మంత్రివర్గం తీర్మానం చేసినట్లు యోగి వెల్లడించారు.(3లో..)



## ట్రాఫిక్‌కు చెక్..హైదరాబాద్‌కు కొత్త ప్రణాళిక!

**పీఆర్టీ వ్యవస్థకు సీఎం రేవంత్ దిశానిర్దేశం**

**భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రవాణా**

**ఏడాదిలోగా ఫ్లైఓవర్లు పూర్తి చేయాలని ఆదేశాలు**

హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. క్యూర్ పరిధిలో ప్రజా రవాణాను ఆధునికీకరించడంతో పాటు రహదారుల అనుసంధానాన్ని మెరుగుపరచాలని సూచించారు. శుక్రవారం రాత్రి నిర్వహించిన సమీక్షలో పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ (పీఆర్టీ) వ్యవస్థ ఏర్పాటుపై అధికారులు ప్రజంటేషన్ ఇచ్చారు. రద్దీ ప్రాంతాలు, పారిశ్రామిక కేంద్రాల నుంచి మెట్రో, ఎంఎంటీఎస్, బస్ స్టేషన్లకు ప్రయాణికులు సులభంగా చేరుకునేలా ఈ వ్యవస్థను రూపొందించాలని సీఎం ఆదేశించారు. (వివరాలు 2లో..)




# ఢిల్లీ రణరంగమేనా?

## నేడు జంతర్ మంతర్ దిగ్బంధం.. కేంద్రం ఉక్కుపాదం..

- ఈగను చంపడానికి సుత్తి వాడతారా? సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- జ్ఞానేశ్ కుమార్ రాజీనామా వరకు పోరాటమే.. సీజేపీ సమరశంఖం!

ఒక్క రాత్రి.. వందల ప్రశ్నలు.. దేశమంతా ఉత్కంఠ! ఉదయం పది గంటలు.. దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వైపు అందరి చూపులు! ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) సమరశంఖం పూరించింది. రాజీనామా చేసే వరకు వెనక్కి తగ్గేది లేదని సవాల్.. నిరసనకు అనుమతి లేదని పోలీసుల హెచ్చరిక! ఢిల్లీ వీధుల్లో బారికేడ్లు.. అడుగడుగునా నిఘా.. 20 వేల మందికి పైగా పోలీసు, పారామిలిటరీ బలగాల మోహరింపు! 57 మెట్రో స్టేషన్ల మూసివేత.. రైళ్ల రద్దు.. నిరసన ప్రాంతం చుట్టూ నాలుగు కిలోమీటర్ల పరిధిలో 24 గంటల ఇంటర్నెట్ ఆంక్షలు! అసలేం జరుగుతోంది ఢిల్లీలో? ఒక నిరసనను అడ్డుకోవడానికి ఇంత భారీ ఏర్పాట్లు ఎందుకు? ప్రభుత్వాన్ని సీజేపీ సూటిగా ప్రశ్నిస్తోంది. ఇదే సమయంలో రంగంలోకి దిగిన సుప్రీంకోర్టు.. ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది! "ఈగను చంపడానికి సుత్తి వాడతారా?" అన్న వ్యాఖ్యలతో ఆంక్షలపై కీలక ప్రశ్నలు! అటు రాష్ట్రాలకు కేంద్ర హోంశాఖ ఆదేశాలు.. ఇటు జంతర్ మంతర్‌కు చేరుకుంటామంటున్న సీజేపీ! నిరసన సాగుతుందా? అరెస్టులు జరుగుతాయా? ఆంక్షలు సడలుతాయా? ప్రజాస్వామ్య పోరాటం కొత్త మలుపు తిరుగుతుందా? ఢిల్లీ నేడు ఏ చరిత్రకు వేదిక కాబోతోంది? క్షణక్షణం ఉత్కంఠ.. సమాధానం కోసం దేశం ఎదురుచూపులు!

## నిరసన హక్కుకు మద్దతు..

### ఆంక్షలపై అభ్యంతరం

**ఢిల్లీ రవాణా నిలిపివేతపై సుప్రీంకోర్టు ఆగ్రహం**

**నగరాన్ని స్తంభింపజేయడం అతి చర్యన్న ధర్మాసనం**

ఢిల్లీలో అక్టోబర్ 10న జరగనున్న నిరసనల నేపథ్యంలో ప్రజా రవాణాపై ఆంక్షలు విధించడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టనున్న ఆందోళనకు ముందు ఢిల్లీ పోలీసులు తీసుకున్న చర్యలు అతిగా ఉన్నాయని అభిప్రాయపడింది. నిరసనలను నియంత్రించడం వేరు.. నగరంలో రాకపోకలను పూర్తిగా నిలిపివేయడం వేరు అని స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం ప్రజల ప్రయాణ స్వేచ్ఛకు భంగం కలగకూడదని పేర్కొంది.

## నిఘా నీడలో ఢిల్లీ

**నిరసనకారులు రాకుండా పోలీసుల వల!**

**200 గ్రూపులపై ఫోకస్.. ముందస్తు నిర్బంధాలు**

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించ తలపెట్టిన నిరసనను అడ్డుకునేందుకు పోలీసులు విస్తృత చర్యలు చేపట్టారు. కాక్రోచ్ జనతా పార్టీ, విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన ఈ ఆందోళనలో పాల్గొనే అవకాశం ఉన్నవారితో ప్రత్యేక డేటాబేస్ రూపొందించినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఇతర రాష్ట్రాల నుంచి నిరసనకారులు ఢిల్లీకి చేరకుండా ఆయా రాష్ట్రాల పోలీసులతో సమన్వయం చేస్తున్నారు. అనుమానితులను ముందుగానే అదుపులోకి తీసుకోవడం, ప్రశ్నించడం, వారి ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించడం వంటి చర్యలు కొనసాగుతున్నట్లు సమాచారం.

## కేంద్రంపై సీజేపీ ఫైర్

### నిర్బంధించినా ఉద్యమం ఆగదు

ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యం అంటూ సీజేపీ నేతలు కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. యువతను చూసి కేంద్రం భయపడుతోందని, దేశంలో ఎమర్జెన్సీ తరహా పరిస్థితులు సృష్టిస్తోందని ఆరోపించారు. ఢిల్లీలో అక్టోబర్ 10న తలపెట్టిన నిరసనకు ముందు భారీ భద్రతా ఆంక్షలు విధించడంపై ప్రశ్నించారు. శుక్రవారం అర్ధరాత్రి సోషల్ మీడియా వేదికగా విడుదల చేసిన వీడియో సందేశంలో సీజేపీ నేత అభిజీత్ దీప్కే వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. తనను అరెస్టు చేసినా నిరసన ఆగకూడదని పిలుపునిచ్చారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే తమ పోరాటమని ప్రకటించారు. ప్రభుత్వ ఆంక్షలు, పోలీసుల చర్యల మధ్య నిరసనను కొనసాగిస్తామని సీజేపీ నేతలు స్పష్టం చేశారు. యువతను ఎందుకు పాకిస్థానీయుల్లా చూస్తున్నారని నిలదీశారు. నిరసనకారులను అడ్డుకోవడానికి దేశవ్యాప్తంగా నిర్బంధాలు, రవాణా ఆంక్షలు విధించడం అత్యవసర పరిస్థితిని తలపిస్తోందని ఆరోపించారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తనను అరెస్టు చేసినా, నిర్బంధించినా ఆందోళన ఆగకూడదని పిలుపునిచ్చారు. నిరసనకారులు శాంతియుతంగా వ్యవహరిస్తూనే తమ డిమాండ్ కోసం ఉద్యమాన్ని కొనసాగించాలని కోరారు. మరోవైపు, నిరసన నేపథ్యంలో జనపథ్-కర్తవ్య పథ్ కూడలి చుట్టూ నాలుగు కిలోమీటర్ల పరిధిలో ఇంటర్నెట్ సేవలను తాత్కాలికంగా నిలిపివేయడానికి కేంద్ర హోంశాఖ అనుమతించింది. అక్టోబర్ 9 రాత్రి 10 గంటల నుంచి అక్టోబర్ 10 రాత్రి 10 గంటల వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి.




## విజయ్ దెబ్బకు కూలిన కంచుకోటలు!

- రెండు ఉప ఎన్నికల్లో టీవీకే జయభేరి తమిళ రాజకీయాల్లో అన్నాడీఎంకే పతనం
- మూడో స్థానానికి పరిమితం

తమిళ రాజకీయాల్లో ఒకప్పుడు తిరుగులేని శక్తిగా వెలిగిన అన్నాడీఎంకేకు ఇప్పుడు అస్తిత్వ సంకటమా? దశాబ్దాల రాజకీయ ఆధిపత్యానికి తెరపడబోతోందా? విజయ్ రాజకీయ వ్యూహం ప్రత్యర్థుల పునాదులనే కదిలిస్తోందా? మధురాంతకం, ధారాపురం ఉప ఎన్నికల ఫలితాలు ఈ ప్రశ్నలకు మరింత పదును పెట్టాయి. అన్నాడీఎంకే సిట్టింగ్ స్థానాలనే కైవసం చేసుకున్న టీవీకే, మధురాంతకంలో ఆ పార్టీని మూడో స్థానానికి నెట్టేసింది. డీఎంకే రెండో స్థానంలో నిలవగా, పళనిస్వామి నాయకత్వంపై కొత్త సందేహాలు మొదలయ్యాయి. ప్రత్యర్థులతో కుమ్మక్కయ్యారన్న విజయ్ ఆరోపణలు, కూటమి రాజకీయాల్లో నెలకొన్న విభేదాలు, పార్టీ మార్పులపై ఊహాగానాలు.. వెరసి తమిళ రాజకీయాలు కీలక మలుపు తిరుగుతున్నాయి. ఈ విజయాలు విజయ్‌కు కేవలం రెండు సీట్లు మాత్రమే కాదు.. తన రాజకీయ బలాన్ని చాటుకునే అవకాశం, ప్రత్యర్థుల వ్యూహాలను ఎదుర్కొనే ధైర్యం, భవిష్యత్తు రాజకీయ సమీకరణాలను మార్చే ఆయుధం! అయితే ఇది అన్నాడీఎంకే అంతానికి ఆరంభమా? లేక తాత్కాలిక ఎదురుదెబ్బ మాత్రమేనా? డీఎంకేకు ముప్పు ఎక్కడి నుంచి రాబోతోంది? తమిళనాట పాత రాజకీయ సమీకరణాలను కూలదోసి కొత్త శకానికి విజయ్ నాంది పలుకుతున్నారా? రెండు ఉప ఎన్నికలు.. మూడు పార్టీల భవిష్యత్తు.. తమిళ రాజకీయాల్లో మొదలైన కొత్త యుద్ధం! అసలు తెరవెనుక ఏం జరిగింది?



## ఉప ఎన్నికల్లో అధికార పార్టీల హవా!

**బెంగాల్‌లో బీజేపీ, తమిళనాడులో టీవీకే జోరు**

దేశవ్యాప్తంగా జరిగిన ఉప ఎన్నికల్లో అధికార పార్టీల ఆధిపత్యం స్పష్టమైంది. పశ్చిమ బెంగాల్‌లో నందిగ్రామ్, రెజీనగర్ అసెంబ్లీ స్థానాలను బీజేపీ భారీ మెజారిటీలతో కైవసం చేసుకుంది. నందిగ్రామ్‌లో హసి రాణి రాథ్ ఏకంగా 1.22 లక్షలకు పైగా ఓట్ల ఆధిక్యంతో గెలుపొందగా, రెజీనగర్‌లో శంకర్ రవ్ సర్కార్ 75 వేలకుపైగా ఓట్ల మెజారిటీ సాధించారు. మైనారిటీ ఓటర్లు అధికంగా ఉన్న ప్రాంతాల్లోనూ బీజేపీ విజయం సాధించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. (వివరాలు 3లో..)




## ఓటు చోరీ ఆధారాలు

- రాష్ట్రపతితో రాహుల్ గాంధీ
- సుప్రీంకోర్టుకు వెళ్లాలని నిర్ణయం

దేశంలో ఎన్నికల అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలోని ఇండియా కూటమి నేతలు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. ఎన్నికల సంఘం పనితీరుపై ఆందోళన వ్యక్తం చేస్తూ వినతిపత్రం సమర్పించారు. ఓటు చోరీకి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, దేశమంతా ఈ పరిణామాలను గమనించిందని రాహుల్ పేర్కొన్నారు. రాష్ట్రపతి ఆధారాలు అడిగారని, ఆరోపణలను తోసిపుచ్చలేదని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సమావేశంపై రాష్ట్రపతి కార్యాలయం నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు.




## తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక బతుకమ్మ: రేవంత్ రెడ్డి

తెలంగాణ ఆడబిడ్డలందరికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఎంగిలిపూల బతుకమ్మ నుంచి సద్దుల బతుకమ్మ వరకు తొమ్మిది రోజులపాటు మహిళలంతా ఆటపాటలతో, ఆనందోత్సాహాల మధ్య వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి గౌరమ్మను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించడం తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేకమైన సంప్రదాయమని పేర్కొన్నారు.



## తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ ప్రతిబింబం: కేసీఆర్

తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ ప్రారంభం సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పూలనే దేవతగా కొలుస్తూ ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ దేశంలోని సంప్రదాయ వేడుకల్లో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందని పేర్కొన్నారు. తెలంగాణ జీవన విధానానికి, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, సామాజిక సంస్కృతికి బతుకమ్మ అద్దం పడుతుందని అన్నారు. (వివరాలు 2లో..)

## 95 లక్షల ఓట్లు తొలగింపు అవాస్తవం!

- ఓటర్ల జాబితాపై తప్పుడు ప్రచారం
- స్పష్టం చేసిన ఎన్నికల ప్రధాన అధికారి




తెలంగాణలో 95 లక్షల ఓట్లు తొలగించారంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై వాస్తవాలకు విరుద్ధంగా వార్తలు ప్రచారంలో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఏఎస్‌డీడీ కేటగిరీ కింద 73,39,235 మంది ఓటర్లను గుర్తించినట్లు వెల్లడించారు. (వివరాలు 2లో..)

## 125 ఏళ్ల తర్వాత సమగ్ర భూసర్వే

**భూ వివాదాలకు చెక్.. 18 నెలల్లో రీ-సర్వే!**

**పర్యవేక్షణకు 14 మంది అధికారులు**



తెలంగాణలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమగ్ర భూసర్వేను ఏడాదిన్నరలో పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా సర్వేలో వేగం, నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో ఏడు జోన్ల పర్యవేక్షణకు రెవెన్యూ, సర్వే విభాగాల నుంచి 14 మంది అధికారులను నియమించినట్లు తెలిపారు. (వివరాలు 2లో..)

SUSHEE® INFRA
Constructive Contributions




## రేడియల్ రోడ్డు టెండర్లపై హైకోర్టు బ్రేక్!

- సుశీ ఇన్‌ఫ్రా పిటిషన్లపై కీలక ఆదేశాలు..
- టెండర్ల ఖరారుపై న్యాయస్థానం కీలక ఆదేశాలు




## ఓటు హక్కుకు రక్షణ కల్పించాలి

**రాజ్యాంగం కంటే ఎవరూ ఎక్కువ కాదు!**

**జ్ఞానేశ్ కుమార్ వైదొలగాలి..**

**సర్ అక్రమాలపై స్వతంత్ర విచారణ జరపాలి: కేటీఆర్**

భారత రాజ్యాంగం కంటే గొప్పది ఏదీ లేదని, దేశంలోని ఏ పౌరుడి ఓటు హక్కును తొలగించే అధికారం ఎవరికీ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడం ప్రతి వ్యవస్థ బాధ్యతని పేర్కొన్నారు. ఓటర్ల హక్కులకు భంగం కలిగించే చర్యలను సహించలేమని ఆయన వ్యాఖ్యానించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. (వివరాలు 2లో..)



## సర్‌పై బీఆర్ఎస్ మౌనం..

### బీజేపీ అంటే భయమా?:

**మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు..**

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై బీఆర్ఎస్ స్పందించకపోవడానికి బీజేపీతో ఉన్న రాజకీయ సంబంధాలే కారణమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అర్హులైన ఓటర్లను తొలగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. (వివరాలు 2లో..)



# 125 ఏళ్ల తర్వాత సమగ్ర భూసర్వే

**భూ వివాదాలకు చెక్..**
**18 నెలల్లో రీ–సర్వే!**
**పర్యవేక్షణకు 14 మంది అధికారులు**

తెలంగాణలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమగ్ర భూసర్వేను ఏడాదిన్నరలో పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా సర్వేలో వేగం, నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో ఏడు జోన్ల పర్యవేక్షణకు రెవెన్యూ, సర్వే విభాగాల నుంచి 14 మంది అధికారులను నియమించినట్లు తెలిపారు. మొత్తం 2,768 గ్రామాల్లో సర్వే చేపట్టగా, ఇప్పటివరకు 245 గ్రామాల్లో పూర్తయిందని వెల్లడించారు. తొలి దశ పనులను నవంబర్ చివరి నాటికి ముగించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ప్రతి మండలంలో రెండు సర్వే బృందాలను ఏర్పాటు చేసి, తహసీల్దార్లు రోజువారీ పనులను పరిశీలించాలని సూచించారు.



**డాష్ బోర్డుతో పర్యవేక్షణ..**
**అక్రమ వసూళ్లపై హెచ్చరిక**

సర్వే పురోగతి, గ్రామాల వారీగా పూర్తయిన పనులు, సర్వే బృందాలు, రోవర్ల వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు హైదరాబాద్ లో ప్రత్యేక డాష్ బోర్డు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన సాంకేతిక పరికరాల కొనుగోలుకు నిధుల కొరత ఉండదని స్పష్టం చేశారు. రాష్ట్రస్థాయిలో ప్రతి వారం సమీక్ష నిర్వహిస్తామని, ప్రతి 15 రోజులకు తాను స్వయంగా పురోగతిని పరిశీలిస్తానని తెలిపారు. ప్రభుత్వ భూముల సరిహద్దుల గుర్తింపులో సంబంధిత శాఖల అధికారులు పాల్గొనాలని సూచించారు. రీ-సర్వే పేరుతో ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**ఎర్రవల్లి భూములపై**
**మంత్రి కీలక వ్యాఖ్యలు**

మీడియాతో మాట్లాడిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎర్రవల్లిలో 385 ఎకరాలకు సంబంధించిన సర్వేలో 45 ఎకరాల తేడా గుర్తించినట్లు తెలిపారు. మరోసారి నోటీసులు జారీ చేశామని వెల్లడించారు. అక్కడ అసైన్డ్ భూములు చేతులు మారిన అంశాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న అసైన్డ్ భూములను గుర్తించి, అర్హులైన పేదలకు పంపిణీ చేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అమరవీరులను గుర్తించి వారికి న్యాయం చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# హైదరాబాద్ ట్రాఫిక్ కు చెక్

**కొత్త ప్రణాళిక!**
**పీఆర్టీ వ్యవస్థకు సీఎం రేవంత్ దిశానిర్దేశం**
**భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రవాణా**
**ఏడాదిలోగా ఫ్లైఓవర్లు పూర్తి చేయాలని ఆదేశాలు**



హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. క్యూర్ పరిధిలో ప్రజా రవాణాను ఆధునికీకరించడంతో పాటు రహదారుల అనుసంధానాన్ని మెరుగుపరచాలని సూచించారు. శుక్రవారం రాత్రి నిర్వహించిన సమీక్షలో పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ (పీఆర్టీ) వ్యవస్థ ఏర్పాటుపై అధికారులు ప్రజంటేషన్ ఇచ్చారు. రద్దీ ప్రాంతాలు, పారిశ్రామిక కేంద్రాల నుంచి మెట్రో, ఎంఎంటీఎస్, బస్ స్టేషన్లకు ప్రయాణికులు సులభంగా చేరుకునేలా ఈ వ్యవస్థను రూపొందించాలని సీఎం ఆదేశించారు. అంతర్జాతీయ నగరాల్లో అమలవుతున్న అత్యుత్తమ సాంకేతికతను అధ్యయనం చేసి త్వరగా పనులు ప్రారంభించాలని స్పష్టం చేశారు.

**కేబీఆర్ పార్క్ చుట్టూ**
**ట్రాఫిక్ కు ఉపశమనం**

కేబీఆర్ పార్క్ పరిసరాల్లో వన్ వే విధానం ద్వారా రాకపోకలను మరింత సజావుగా నిర్వహించాలని సీఎం సూచించారు. ఫ్రీ లెఫ్ట్ లు, యూటర్న్ లు, రహదారుల కూడళ్ల వద్ద అవసరమైన మార్పులు చేపట్టాలని ఆదేశించారు. నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీ చెక్ పోస్టు వైపు ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయాలని, యుటిలిటీల తరలింపును త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ముంబైలో అనుసరిస్తున్న నిర్మాణ సాంకేతికతను అధ్యయనం చేసి ప్రారంభించిన పనులను ఏడాదిలోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**రేడియల్ రోడ్లు..**
**కొత్త మార్గాలపై అధ్యయనం**

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో రవాణా అనుసంధానాన్ని పెంచేందుకు కొత్త రహదారుల నిర్మాణంపై సీఎం దృష్టి సారించారు. హైదరాబాద్-ముంబై బుల్లెట్ రైలు మార్గానికి సమాంతరంగా రేడియల్ రోడ్డు నిర్మించే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. శంకర్ పల్లి-చేవెళ్ల మధ్య ప్రస్తుత రహదారుల విస్తరణతో పాటు కొత్త మార్గాల నిర్మాణ సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని సూచించారు. క్యూర్ పరిధిలో ఫ్లైఓవర్లు, అండర్ పాస్ ల నిర్మాణాన్ని వేగవంతం చేసి వివిధ ప్రాంతాల మధ్య ప్రయాణ సమయాన్ని తగ్గించాలని స్పష్టం చేశారు.

**రీసైకిల్డ్ వాటర్ వినియోగానికి ప్రాధాన్యం**

రీసైకిల్డ్ వాటర్ వినియోగాన్ని విస్తరించేందుకు రూపొందించిన ప్రణాళికలను వేగంగా అమలు చేయాలని సీఎం ఆదేశించారు. రోజుకు 500 ఎంఎల్ డీ నీటిని తిరిగి వినియోగించే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధమైనట్లు అధికారులు వివరించారు. ఫ్యూచర్ సిటీ, చందన్ వల్లి, ఆలూరులోని డేటా సెంటర్లు, పరిశ్రమలతో పాటు ఎత్తైన భవనాలు, పార్కులు, ల్యాండ్ స్కేపింగ్ లో ఈ నీటిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్యూర్ చట్టం అమలుకు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లు, హైడ్రా, వాటర్ బోర్డు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొత్త కార్పొరేషన్ల కార్యాలయాల పనులను కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు.

# ఓటు హక్కుకు రక్షణ కల్పించాలి

**రాజ్యాంగం కంటే ఎవరూ ఎక్కువ కాదు!**
**జ్ఞానేశ్ కుమార్ వైదొలగాలి..**
**సర్ అక్రమాలపై స్వతంత్ర విచారణ జరపాలి: కేటీఆర్**

రాజ్యాంగం కంటే గొప్పది ఏదీ లేదని, దేశంలోని ఏ పౌరుడి ఓటు హక్కును తొలగించే అధికారం ఎవరికీ లేదని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడం ప్రతి వ్యవస్థ బాధ్యతని పేర్కొన్నారు. ఓటర్ల హక్కులకు భంగం కలిగించే చర్యలను సహించలేమని ఆయన వ్యాఖ్యానించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



**వ్యక్తుల కంటే వ్యవస్థలే ముఖ్యం**

దేశ చరిత్రలో ఎందరో వ్యక్తులు వచ్చారని, వెళ్లారని, అయినా భారతదేశం తన బలాన్ని నిలుపుకుంటూ ముందుకు సాగిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఏ ఒక్క వ్యక్తి కోసం వ్యవస్థలను కాపాడాలనే పేరుతో ఇంతటి ప్రయత్నం ఎందుకని ప్రశ్నించారు. 140 కోట్ల మంది భారతీయుల హక్కుల కంటే ఒక వ్యక్తి ఎలా గొప్పవాడవుతారని నిలదీశారు. వ్యక్తుల కంటే రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థలే ఉన్నతమైనవని ఆయన తన ప్రకటనలో స్పష్టం చేశారు.

**ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీయొద్దు**

దేశ రాజ్యాంగ మూల సూత్రాలను బలహీనపరిచేలా ప్రత్యామ్నాయ వ్యవస్థలను నిర్మించే ప్రయత్నాలను అనుమతించకూడదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజలకు విశ్వాసం నిలవాలంటే ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా బాధ్యతాయుతమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడటం దేశంలోని అన్ని సంస్థల బాధ్యతని గుర్తుచేశారు.

**సర్ పై సుప్రీంకోర్టు జోక్యం కోరిన బీఆర్ ఎస్**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై సుప్రీంకోర్టు స్వయంగా విచారణకు స్వీకరించాలని కేటీఆర్ కోరారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు సుమోటోగా స్పందించి, సిట్టింగ్ న్యాయమూర్తి నేతృత్వంలో స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలని బీఆర్ ఎస్ తరఫున డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత, పౌరుల ఓటు హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జై తెలంగాణ.. జై హింద్ అంటూ తన ప్రకటనను ముగించారు.

# తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక బతుకమ్మ: రేవంత్ రెడ్డి



తెలంగాణ ఆడబిడ్డలందరికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఎంగిలిపూల బతుకమ్మ నుంచి సద్దుల బతుకమ్మ వరకు తొమ్మిది రోజులపాటు మహిళలంతా ఆటపాటలతో, ఆనందోత్సాహాల మధ్య వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి గౌరమ్మను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించడం తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేకమైన సంప్రదాయమని పేర్కొన్నారు. బతుకమ్మ కేవలం పండుగ మాత్రమే కాదని, తెలంగాణ ప్రజల సామూహిక జీవన విధానానికి, కష్టసుఖాలను పంచుకునే ఐక్యతకు నిలువెత్తు నిదర్శనమని అభివర్ణించారు. ప్రజల సాంస్కృతిక వైభవాన్ని, మహిళల ఐక్యతను చాటిచెప్పే ఈ వేడుకలో అనేక సామాజిక సందేశాలు ఇమిడి ఉన్నాయని తెలిపారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలకు, తెలంగాణ ఆత్మగౌరవానికి బతుకమ్మ ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. ప్రకృతిని ఆరాధించే తెలంగాణ సంస్కృతికి అనుగుణంగా పర్యావరణ పరిరక్షణకు ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. బతుకమ్మ సంబురాలు ప్రతి ఇంటా సంతోషాన్ని నింపాలని, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో పండుగను ఘనంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# రేడియల్ రోడ్డు టెండర్లపై బ్రేక్!

**సుశీ ఇన్‌ఫ్రా పిటిషన్లపై హైకోర్టు కీలక ఆదేశాలు**
**టెండర్ల ఖరారుపై న్యాయస్థానం కీలక ఆదేశాలు**

హైదరాబాద్‌లో రేడియల్ రోడ్డు-2 నిర్మాణ కాంట్రాక్టుల వ్యవహారం హైకోర్టుకు చేరింది. సాంకేతిక బిడ్‌లో తమను అనర్హులుగా ప్రకటించడాన్ని సవాలు చేస్తూ సుశీ ఇన్‌ఫ్రా అండ్ మైనింగ్ లిమిటెడ్ దాఖలు చేసిన మూడు పిటిషన్లపై జస్టిస్ బి. విజయసేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. ఇప్పటికే టెండర్లకు సంబంధించి ఏవైనా నిర్ణయాలు తీసుకుని ఉంటే అవి కోర్టు తదుపరి ఉత్తర్వులకు లోబడి ఉంటాయని స్పష్టం చేశారు. టెండర్ల ఖరారు ఆధారంగా కాంట్రాక్టుదారులు ప్రత్యేక న్యాయపరమైన హక్కులు కోరడానికి వీల్లేదని పేర్కొన్నారు. తదుపరి విచారణను ఈ నెల 12కు వాయిదా వేశారు.




**అనర్హతపై సుశీ ఇన్‌ఫ్రా అభ్యంతరం**

కొత్వాల్‌గూడ (బుద్వేల్) నుంచి నాచారం సమీపంలోని జాతీయ రహదారి-167ఎన్ వరకు 81.15 కిలోమీటర్ల రేడియల్ రోడ్డు నిర్మాణానికి హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ మూడు ప్యాకేజీలుగా టెండర్లు పిలిచింది. అనుభవ ధ్రువీకరణ పత్రంపై సూపరింటెండింగ్ ఇంజినీర్ కౌంటర్ సంతకం లేదనే కారణంతో సుశీ ఇన్‌ఫ్రా బిడ్‌ను అధికారులు తిరస్కరించారు. అయితే తమకు కేంద్ర రహదారుల శాఖ ప్రాంతీయ కార్యాలయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పత్రం జారీ చేశారని, నిబంధనల ప్రకారం లోపాలపై వివరణ కోరాల్సి ఉన్నా ఆ అవకాశం ఇవ్వలేదని సంస్థ తరఫు న్యాయవాది వాదించారు. మరోవైపు, సాంకేతిక, ధరల బిడ్ల ప్రక్రియ పూర్తయిందని, ఎల్-1 బిడ్డర్‌ను కూడా ప్రకటించామని ప్రభుత్వం తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఐతే, టెండర్లలో అధిక ధరలకు కాంట్రాక్టులు ఖరారు చేయడం వల్ల ప్రభుత్వానికి సుమారు రూ.600 కోట్ల నష్టం వాటిల్లుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ బిడ్‌ను నిబంధనలకు విరుద్ధంగా తిరస్కరించారని సుశీ ఇన్‌ఫ్రా న్యాయం కోరుతోంది. టెండర్ల ప్రక్రియపై తదుపరి విచారణలో హైకోర్టు ఏం నిర్ణయిస్తుందన్నది కీలకంగా మారింది.

# సర్‌పై బీఆర్ఎస్ మౌనం

**బీజేపీ అంటే భయమా?**
**మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు..**



తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై బీఆర్ఎస్ స్పందించకపోవడానికి బీజేపీతో ఉన్న రాజకీయ సంబంధాలే కారణమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. గాంధీభవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అర్హులైన ఓటర్లను తొలగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 90 లక్షల మంది ఓటర్లపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొంటూ, ప్రధాన ప్రతిపక్షం ఎందుకు నిరసనకు దిగడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు, ఫార్ములా-ఈ కార్ రేసింగ్ కేసుల భయంతోనే కేసీఆర్, కేటీఆర్ మౌనంగా ఉన్నారని విమర్శించారు. బీజేపీ నేత కిషన్ రెడ్డితో బీఆర్ఎస్ కు ఉన్న సాన్నిహిత్యాన్ని ప్రస్తావిస్తూ, రెండు పార్టీల మధ్య లోపాయికారీ అవగాహన ఉందని ఆరోపించారు.

**దళితులు, మైనారిటీల ఓట్లపై ఆందోళన**

సర్ ప్రక్రియలో దళితులు, గిరిజనులు, మైనారిటీల ఓట్లకు నష్టం జరిగే ప్రమాదం ఉందని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. పశ్చిమ బెంగాల్, బిహార్ లలో బీజేపీ అనుసరించిన వ్యూహాలనే తెలంగాణ, పంజాబ్ లలో అమలు చేస్తున్నారని విమర్శించారు. ఓటర్ల జాబితా సవరణలో క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి అధికారులకు ఇచ్చిన ఫారాల లెక్కింపులో లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వైఖరిపైనా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. టీఎన్ శేషన్, లింగ్డో వంటి అధికారుల కాలంలో ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం ఉండేదని గుర్తుచేశారు. అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడటమే కాంగ్రెస్ లక్ష్యమని స్పష్టం చేశారు.

## వర్షాభావంపై సీఎం కీలక భేటీ!



రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ నెల 12న మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదవడంతో పాటు దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రధానంగా చర్చించనున్నారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీటి సరఫరా, పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ వంటి అంశాలపై సమీక్షించి తక్షణ చర్యలను ఖరారు చేసే అవకాశముంది. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలోనూ వర్షాభావ పరిస్థితులపై విస్తృతంగా చర్చించారు. కరువు ప్రభావిత ప్రాంతాల్లో రైతులకు అవసరమైన సహాయం అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది.



# అంతర్జాతీయ పెట్టుబడులే ప్రధాన లక్ష్యం

**గ్లోబల్ సమ్మిట్ విజయవంతానికి**
**భట్టి దిశానిర్దేశం**

తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దడంతో పాటు రాష్ట్ర ప్రతిష్ఠను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహిస్తోంది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సమ్మిట్ నిర్వహణ కోసం ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన వార్ రూమ్‌ను శుక్రవారం సందర్శించిన ఆయన వివిధ శాఖలకు అప్పగించిన బాధ్యతలపై సమీక్షించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ప్రపంచస్థాయి పెట్టుబడులను ఆకర్షించడం అత్యంత కీలకమని పేర్కొంటూ ఏర్పాట్లలో ఎలాంటి జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు.

**శాఖల మధ్య సమన్వయంతో ఏర్పాట్లు**

గ్లోబల్ సమ్మిట్ విజయవంతానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన వివిధ కమిటీలు సమన్వయంతో పనిచేస్తూ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని భట్టి విక్రమార్క సూచించారు. అధికారులకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని, శాఖల మధ్య నిరంతర సమాచార మార్పిడి ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి శాఖ సమష్టి బాధ్యతతో పనిచేసి సమ్మిట్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణకు అంతర్జాతీయ పెట్టుబడులు రావడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడాలని ప్రభుత్వం ఆశిస్తోంది. సమావేశంలో ఆర్థిక, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి గౌరవ్ ఉప్పల్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 95 లక్షల ఓట్లు తొలగింపు అవాస్తవం!



**ఓటర్ల జాబితాపై తప్పుడు ప్రచారం**
**స్పష్టం చేసిన ఎన్నికల ప్రధాన అధికారి**

తెలంగాణలో 95 లక్షల ఓట్లు తొలగించారంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై వాస్తవాలకు విరుద్ధంగా వార్తలు ప్రచారంలో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఏఎస్‌డీడీ కేటగిరీ కింద 73,39,235 మంది ఓటర్లను గుర్తించినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు 92,88,187 నోటీసులు జారీ చేయగా, 92,23,486 నోటీసులు ఓటర్లకు అందాయని వివరించారు. మరో 64,701 నోటీసులు పంపిణీ చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాపై ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రచారాన్ని నమ్మవద్దని అధికారుల వివరణ స్పష్టం చేస్తోంది.

**74 లక్షల మందికి అర్హత..**

నోటీసులు అందుకున్న వారిలో ఇప్పటివరకు 82,11,205 మంది వివరాల పరిశీలన పూర్తయిందని ఎన్నికల అధికారి తెలిపారు. వీరిలో 74,62,851 మంది తుది ఓటర్ల జాబితాలో చోటు పొందేందుకు అర్హులుగా గుర్తించినట్లు వెల్లడించారు. మరో 12,969 మంది అనర్హులుగా తేలినట్లు వివరించారు. ఇంకా 18,12,367 మంది ఓటర్లకు సంబంధించిన అంశాలపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. మిగిలిన నోటీసులపై 2026 నవంబర్ 5లోగా నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. ఓటర్ల జాబితా సవరణపై ప్రచారమవుతున్న సంఖ్యలకు వాస్తవ పరిస్థితులకు పొంతన లేదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. ఓటు హక్కుకు సంబంధించిన అంశాల్లో అధికారిక సమాచారాన్నే పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

**తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ**
## ప్రతిబింబం: కేసీఆర్

తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ
ప్రారంభం సందర్భంగా బీఆర్ఎ
అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమం
కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు రా
ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పూల
దేవతగా కొలుస్తూ ప్రకృతిని ఆరాధిం
బతుకమ్మ పండుగ దేశంలో
సంప్రదాయ వేడుకల్లో ప్రత్యేక స్థానా
కలిగి ఉందని పేర్కొన్నారు. తెలంగా
జీవన విధానానికి, ఆడబిడ్డల ఆత్మగౌర
నికి, సామాజిక సంస్కృతికి బతుకమ
అద్దం పడుతుందని అన్నారు. ఎంగిలిపూ
బతుకమ్మతో ప్రారంభమై సద్దుల బతు
మ్మతో ముగిసే తొమ్మిది రోజుల పండు
రాష్ట్రవ్యాప్తంగా ఆనందోత్సాహాలను నిం
తుందని తెలిపారు. ఆడపడుచు
ఒకచోట చేరి బతుకమ్మలను పేర్చి ఆట
టలతో వేడుకలు జరుపుకోవడ
తెలంగాణ ప్రత్యేకతగా అభివర్ణించారు.



# విమానాశ్రయానికి మోదీ పేరు!

- **యూపీ కేబినెట్ కీలక నిర్ణయం..**
- **జాతీయ విమానయాన కేంద్రంగా జేవర్**

ఉత్తరప్రదేశ్‌లోని జేవర్ వద్ద నిర్మిస్తున్న నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఆమోదం లభించింది. విమానాశ్రయానికి 'నరేంద్ర మోదీ అంతర్జాతీయ విమానాశ్రయం, నోయిడా-జేవర్'గా పేరు మార్చేందుకు మంత్రివర్గం తీర్మానం చేసినట్లు యోగి వెల్లడించారు.

**రాష్ట్రానికి గొప్ప కానుకగా అభివర్ణన**

నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరప్రదేశ్‌కు ప్రధాని అందించిన గొప్ప కానుక అని యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోనే అతిపెద్ద విమానాశ్రయంగా నిలవనున్న ఈ ప్రాజెక్టు భవిష్యత్తులో దేశంలోనే కీలక విమానయాన కేంద్రంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మోదీ దూరదృష్టి వల్ల ఉత్తరప్రదేశ్ ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, రవాణా అనుసంధానంలో కొత్త నమూనాగా మారుతోందని ప్రశంసించారు. విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టడం పట్ల మంత్రివర్గం కృతజ్ఞత ప్రకటించిందని తెలిపారు.

**జాతీయ రహదారులతో రవాణా విస్తరణ**

రాష్ట్రంలో సుమారు రూ.60 వేల కోట్ల వ్యయంతో 2,483 కిలోమీటర్ల పొడవున 42 జాతీయ రహదారులు నిర్మించినట్లు ముఖ్యమంత్రి వివరించారు. ఢిల్లీ-సహారన్‌పూర్-డెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్‌వే, ఢిల్లీ-మీరట్ ఎక్స్‌ప్రెస్‌వే, కాన్పూర్-లక్నో ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. విమానాశ్రయంతో పాటు రహదారుల అభివృద్ధి రాష్ట్రంలో రవాణా సౌకర్యాలను మరింత విస్తరించనుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు ఉత్తరప్రదేశ్ అభివృద్ధికి కీలకంగా మారనున్నాయని ప్రభుత్వం భావిస్తోంది.

**రామమందిర నిర్మాణంపై యోగి ప్రస్తావన**

అయోధ్యలో రామజన్మభూమి ఆలయంలో రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠాపన నెరవేరడం చారిత్రక ఘట్టమని యోగి వ్యాఖ్యానించారు. సుమారు 500 ఏళ్ల నిరీక్షణకు ముగింపు పలికిన ఈ పరిణామం రాష్ట్రానికే కాకుండా దేశమంతటికీ గర్వకారణమని పేర్కొన్నారు. ఆలయంపై ధర్మధ్వజం ఎగురవేయడం కూడా చారిత్రక సందర్భమని తెలిపారు. ఆధ్యాత్మికత, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణలో ప్రధాని మోదీ చేసిన కృషి చిరస్మరణీయమని యోగి ప్రశంసించారు.



# డియర్ ప్రైమ్ మినిస్టర్ అంబానీ

- **ముకేశ్‌పై మస్క్ మాటల యుద్ధం!**

భారత్‌లో శాటిలైట్ ఇంటర్నెట్ సేవల ప్రవేశంపై వివాదం ముదురుతోంది. స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్, రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీని లక్ష్యంగా చేసుకుని వరుస విమర్శలు గుప్పిస్తున్నారు. తాజాగా ఎక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించినట్లుగా వ్యంగ్యంగా పోస్టు చేస్తూ, అంబానీని 'భారత్‌కు అసలైన ప్రధాని'గా పేర్కొన్నారు. "ప్రియమైన ప్రధాని అంబానీ గారూ.. మీరే భారతదేశానికి అసలైన బాస్ అని ఇంతకాలం గుర్తించలేకపోయినందుకు దయచేసి నా వినయపూర్వక క్షమాపణలను స్వీకరించండి." అంటూ రాసుకొచ్చారు.

**టార్గెట్ అంబానీ**

"సహజంగానే, భారతదేశంలోని గొప్ప ప్రజలను గుత్తాధిపత్యం ద్వారా దోపిడీ చేస్తూ కొనసాగించడానికే మీరు ఇష్టపడతారు. అయినప్పటికీ, స్టార్‌లింక్‌కు పోటీ పడే అవకాశం కల్పించడాన్ని మీరు పరిశీలించగలరా?" అని ఆయన ప్రశ్నించారు. "భారత్‌లోనే కాదు, ప్రతి దేశంలోనూ ఇంటర్నెట్ సదుపాయం లేని అనేక ప్రాంతాలు ఉన్నాయి. దీనివల్ల పిల్లలు విద్యను పొందే అవకాశం కోల్పోతున్నారు. చిన్న వ్యాపారులు తమ వస్తువులను ప్రపంచ మార్కెట్‌లో విక్రయించే అవకాశాన్ని కోల్పోతున్నారు. స్టార్‌లింక్ ఈ పరిస్థితిని మార్చి, వారి జీవితాలను మెరుగుపరుస్తుంది." అని మస్క్ పేర్కొన్నారు.

**గుత్తాధిపత్యంపై మస్క్ ఆరోపణలు**

భారత్‌లో స్టార్‌లింక్ ప్రవేశాన్ని కొందరు వ్యాపార దిగ్గజాలు అడ్డుకుంటున్నారని మస్క్ బుధవారం ఆరోపించారు. గురువారం మరో పోస్టులో, భారత ప్రభుత్వ చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా ఐదేళ్లుగా ప్రయత్నిస్తున్నప్పటికీ లైసెన్స్ ఎందుకు మంజూరు చేయలేదని ప్రశ్నించారు. 165కు పైగా దేశాల్లో స్టార్‌లింక్‌కు అనుమతులు ఉన్నాయని పేర్కొంటూ, భారత్‌లోనూ సేవలు ప్రారంభించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ప్రకృతి విపత్తుల సమయంలో ఇతర కమ్యూనికేషన్ వ్యవస్థలు విఫలమైనప్పుడు స్టార్‌లింక్ ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషించిందని వాదించారు.

**లైసెన్స్‌పై కేంద్రం వివరణ**

మస్క్ ఆరోపణలను కేంద్ర సమాచార శాఖ తోసిపుచ్చింది. శాటిలైట్ కమ్యూనికేషన్ సేవలకు సంబంధించి భారత్‌లో పక్షపాతం లేని నియంత్రణ విధానం అమల్లో ఉందని స్పష్టం చేసింది. స్టార్‌లింక్‌తో పాటు భారతి మద్దతున్న యూటెల్‌శాట్ వన్‌వెబ్, జియో శాటిలైట్ కమ్యూనికేషన్స్‌కు టెలికాం లైసెన్సులు మంజూరయ్యాయి. అయితే సేవలు ప్రారంభించాలంటే స్పెక్ట్రమ్ కేటాయింపుతో పాటు భద్రతా నిబంధనల అనుసరణ అవసరం. ఈ ప్రక్రియలో భద్రతా పరిశీలన కొనసాగుతోందని కేంద్రం తెలిపింది. మస్క్ ఆరోపణలు, కేంద్రం వివరణల మధ్య స్టార్‌లింక్ ప్రవేశంపై వివాదం కొనసాగుతోంది.

# ఎల్‌నినో ఉధృతి వేళ గుడ్ న్యూస్

- **అక్టోబర్ 15 నుంచి భారీ వర్షా లు?**
- **వాయుగుండ ప్రభావంతో వానలు**

ఆంధ్రప్రదేశ్‌కు వర్షాల రూపంలో ఉపశమనం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనం క్రమంగా బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ అంచనాలు సూచిస్తున్నాయి. ఈ ప్రభావంతో అక్టోబర్ 15 నుంచి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉత్తరాంధ్రపై ఈ వ్యవస్థ ప్రభావం ఎక్కువగా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. అక్టోబర్ 13న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే సూచనలు ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనాలు వెల్లడించాయి. అది మరింత బలపడితే వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉంది. అయితే ఈ వ్యవస్థ తుది దిశ, తీవ్రతపై స్పష్టత రావాల్సి ఉంది. అక్టోబర్ 14 నుంచి 16 మధ్య ఉత్తరాంధ్ర తీరానికి సమీపంగా వాయుగుండం లేదా తుపాను తరహా వ్యవస్థ ప్రభావం చూపవచ్చన్న అంచనాలు వెలువడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలతో పాటు ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# ఓటు చోరీ ఆధారాలు



- **రాష్ట్రపతితో రాహుల్ గాంధీ**
- **సుప్రీంకోర్టుకు వెళ్లాలని నిర్ణయం**

దేశంలో ఎన్నికల అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలోని ఇండియా కూటమి నేతలు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. ఎన్నికల సంఘం పనితీరుపై ఆందోళన వ్యక్తం చేస్తూ వినతిపత్రం సమర్పించారు. ఓటు చోరీకి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, దేశమంతా ఈ పరిణామాలను గమనించిందని రాహుల్ పేర్కొన్నారు. రాష్ట్రపతి ఆధారాలు అడిగారని, ఆరోపణలను తోసిపుచ్చలేదని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సమావేశంపై రాష్ట్రపతి కార్యాలయం నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు.

**నాలుగు ప్రధాన డిమాండ్లతో విపక్షాల పోరాటం**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఎన్నికల కమిషనర్లకు రక్షణ కల్పించే 2023 చట్టాన్ని రద్దు చేయాలని విపక్షాలు కోరాయి. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (సర్) నిలిపివేసి తొలగించిన 13.3 కోట్ల మంది ఓటర్ల పేర్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశాయి. అన్ని ఎన్నికల్లో పేపర్ బ్యాలెట్ల విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని, ఓటు చోరీకి స్పష్టమైన ఆధారాలున్న గత రెండేళ్ల అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నాయి. సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కలిసి మరో వినతిపత్రం అందజేస్తామని రాహుల్ ప్రకటించారు.

**పార్లమెంట్ నుంచి రాష్ట్రపతి భవన్ వరకు నిరసన**

పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో సుమారు 150 మంది విపక్ష ఎంపీలు, నేతలు సమావేశమయ్యారు. 16 పార్టీల ప్రతినిధులు వినతిపత్రంపై సంతకాలు చేశారు. అనంతరం పార్లమెంట్ నుంచి రాష్ట్రపతి భవన్ వైపు ర్యాలీ నిర్వహించారు. పది మంది నేతలకు రాష్ట్రపతిని కలిసే అవకాశం లభించగా, మిగిలినవారు కర్తవ్య పథ్ వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడమే తమ లక్ష్యమని కాంగ్రెస్ నేతలు ప్రకటించారు. ఎన్నికల సంఘం తీరుపై దేశవ్యాప్తంగా ఆందోళనలు పెరుగుతున్నాయని ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా వ్యాఖ్యానించారు.

**విపక్షాలపై బీజేపీ ఎదురుదాడి**

విపక్షాలు రాష్ట్రపతి కార్యాలయాన్ని రాజకీయాల్లోకి లాగుతున్నాయని బీజేపీ నేత సుధాంశు త్రివేది విమర్శించారు. ఎన్నికల్లో ఓటములను అంగీకరించలేకే సంస్థలపై ఆరోపణలు చేస్తున్నాయని జేపీ నడ్డా అన్నారు. మరోవైపు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. అక్టోబర్ 10న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ నిరసనకు పిలుపునివ్వడంతో వేలాది మంది పోలీసులను మోహరించారు. పరిసర ప్రాంతాల్లో 24 గంటలపాటు ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దుపై కూడా ఖర్గే అభ్యంతరం వ్యక్తం చేశారు.

# నిరసన హక్కుకు మద్దతు.. ఆంక్షలపై అభ్యంతరం

- **ఢిల్లీ రవాణా నిలిపివేతపై సుప్రీంకోర్టు ఆగ్రహం**
- **నగరాన్ని స్తంభింపజేయడం అతి చర్యన్న ధర్మాసనం**

ఢిల్లీలో అక్టోబర్ 10న జరగనున్న నిరసనల నేపథ్యంలో ప్రజా రవాణాపై ఆంక్షలు విధించడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టనున్న ఆందోళనకు ముందు ఢిల్లీ పోలీసులు తీసుకున్న చర్యలు అతిగా ఉన్నాయని అభిప్రాయపడింది. నిరసనలను నియంత్రించడం వేరు.. నగరంలో రాకపోకలను పూర్తిగా నిలిపివేయడం వేరు అని స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం ప్రజల ప్రయాణ స్వేచ్ఛకు భంగం కలగకూడదని పేర్కొంది.



**మెట్రో, రైళ్లను నియంత్రించాలి.. నిలిపివేయకూడదు**

ఢిల్లీలో మెట్రో రైళ్లు, ఇతర రైళ్ల రాకపోకలను పూర్తిగా నిషేధించకుండా తగిన నియంత్రణలతో నడపాలని సుప్రీంకోర్టు సూచించింది. కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులు ఆంక్షలను పునఃపరిశీలించాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు తెలిపింది. నిరసన హక్కుతోపాటు సాధారణ ప్రజల ప్రయాణ హక్కును కూడా కాపాడాలి అని ధర్మాసనం స్పష్టం చేసింది. ట్రాఫిక్ మార్గదర్శకాలను పత్రికలు, ఆన్‌లైన్ వేదికల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించింది.

**ప్రయాణికుల కష్టాలపై న్యాయవాదుల ఆందోళన**

ఢిల్లీలో భారీ బారికేడ్లు, తనిఖీలు, మెట్రో స్టేషన్ల మూసివేతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీనియర్ న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. 57 మెట్రో స్టేషన్లు మూసివేసినట్లు పేర్కొన్నారు. కేరళం సహా దూర ప్రాంతాల నుంచి ఢిల్లీకి వచ్చే రైళ్లను రద్దు చేశారని పిటిషన్‌లో ఆరోపించారు. విద్యార్థులు, ఉద్యోగులు, రోగులు, ప్రయాణికులు, న్యాయస్థానాలకు వెళ్లేవారు కూడా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరోవైపు, గత నిరసనల్లో నిర్వాహకులు ఇచ్చిన హామీలు ఉల్లంఘించారని, పోలీసులపై దాడులు జరిగాయని కేంద్ర ప్రభుత్వం ఆంక్షలను సమర్థించింది.

**ప్రత్యామ్నాయ నిరసన స్థలంపై ప్రభుత్వానికి సూచన**

శాంతియుత నిరసనలు ప్రజాస్వామ్య హక్కులో భాగమని కోర్టు గుర్తుచేస్తూనే, అక్టోబర్ 10న అవాంఛనీయ ఘటనలు జరిగితే బాధ్యత ఎవరిదనే ప్రశ్నను కూడా లేవనెత్తింది. నిరసనకారులకు తగిన స్థలం కల్పించాలని, తాగునీరు, వైద్యం, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలున్న విశాలమైన ప్రదేశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని సూచించింది. జంతర్ మంతర్ వద్ద నిరసనకు అనుమతి నిరాకరించిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ వేదికపై నిర్ణయం తీసుకోవడానికి ప్రభుత్వం అంగీకరించింది. భద్రత పేరుతో ప్రజల స్వేచ్ఛను పూర్తిగా అడ్డుకోరాదన్నది సుప్రీంకోర్టు ప్రధాన సందేశం.

# నిఘా నీడలో ఢిల్లీ

- **నిరసనకారులు రాకుండా పోలీసుల వల!**
- **200 గ్రూపులపై నిఘా.. ముందస్తు నిర్బంధాలు**

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించ తలపెట్టిన నిరసనను అడ్డుకునేందుకు పోలీసులు విస్తృత చర్యలు చేపట్టారు. కాక్రోచ్ జనతా పార్టీ, విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన ఈ ఆందోళనలో పాల్గొనే అవకాశం ఉన్నవారితో ప్రత్యేక డేటాబేస్ రూపొందించినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఇతర రాష్ట్రాల నుంచి నిరసనకారులు ఢిల్లీకి చేరకుండా ఆయా రాష్ట్రాల పోలీసులతో సమన్వయం చేస్తున్నారు. అనుమానితులను ముందుగానే అదుపులోకి తీసుకోవడం, ప్రశ్నించడం, వారి ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించడం వంటి చర్యలు కొనసాగుతున్నట్లు సమాచారం.

**కేంద్ర హోంశాఖ ఆదేశాలు.. రాష్ట్రాలకు బాధ్యతలు**

నిరసనకారులు నిషేధాజ్ఞలను ఉల్లంఘించి ఢిల్లీలోకి ప్రవేశించే అవకాశం ఉందన్న నిఘా సమాచారంతో కేంద్ర హోంశాఖ అప్రమత్తమైంది. ఢిల్లీ పోలీసులతో కలిసి ముందస్తు చర్యలు అమలు చేయాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. గతంలో వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన నిరసనకారుల వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలగడంతో పాటు ప్రభుత్వ ఆస్తులకు నష్టం జరిగిందని మంత్రిత్వ శాఖ పేర్కొన్నట్లు సమాచారం. రాష్ట్ర నిఘా విభాగాలు, రవాణా సంస్థలు, ఢిల్లీ పోలీసుల మధ్య ఎప్పటికప్పుడు సమాచార మార్పిడి జరగాలని స్పష్టం చేసింది.

**సోషల్ మీడియాపై సైబర్ పోలీసుల కన్ను**

నిరసనకు జనాన్ని సమీకరించేందుకు ఉపయోగిస్తున్న కనీసం 200 వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ గ్రూపులను ఢిల్లీ పోలీసులు గుర్తించి పర్యవేక్షిస్తున్నట్లు గతంలో వార్తలు వెలువడ్డాయి. నిరసనకు హాజరవుతామని చర్చిస్తున్నవారితో పాటు కీలక నిర్వాహకులు, సీజేపీ ప్రధాన బృందం, వారి అనుచరుల సోషల్ మీడియా కార్యకలాపాలపై సైబర్ విభాగం నిఘా పెట్టింది. ఇతర రాష్ట్రాల నుంచి బృందాలుగా ప్రయాణించేవారు, విద్యార్థులు, యువత, గతంలో ఉద్యమాల్లో పాల్గొన్నవారిని ప్రత్యేకంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం.

**విద్యార్థులు, జర్నలిస్టులకు పోలీసుల ఫోన్లు**

దేశవ్యాప్తంగా పలువురు విద్యార్థులు, మద్దతుదారులు, నిర్వాహకులు తమకు పోలీసులు ఫోన్లు చేసి ఢిల్లీకి వస్తున్నారా అని ప్రశ్నించినట్లు ఆరోపించారు. కొందరి ఇళ్లకు వెళ్లి నిరసనలో పాల్గొనవద్దని సూచించినట్లు తెలిపారు. నిరసనను కవర్ చేయాలనుకున్న స్వతంత్ర జర్నలిస్టులు, కంటెంట్ సృష్టికర్తలకు కూడా ఫోన్లు వచ్చాయని, ఢిల్లీ ప్రయాణంపై ఆంక్షలు ఎదురయ్యాయని ఆరోపణలు ఉన్నాయి. గత నిరసనలో విధించిన షరతుల ఉల్లంఘన, శాంతిభద్రతలు, ట్రాఫిక్ నిర్వహణ సమస్యలను కారణాలుగా చూపుతూ అక్టోబర్ 10 ఆందోళనకు ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు. అయితే, ప్రశాంతంగా నిరసన తెలిపే హక్కుపై సుప్రీంకోర్టు వైఖరి ఈ పరిణామాల్లో కీలకంగా మారింది.

## నిరసనపై ఉక్కుపాదం..

- **కేంద్రంపై సీజేపీ ఫైర్**
- **నిర్బంధించినా ఉద్యమం ఆగదు**

ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యం అంటూ సీజేపీ నేతలు కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. యువతను చూసి కేంద్రం భయపడుతోందని, దేశంలో ఎమర్జెన్సీ తరహా పరిస్థితులు సృష్టిస్తోందని ఆరోపించారు. ఢిల్లీలో అక్టోబర్ 10న తలపెట్టిన నిరసనకు ముందు భారీ భద్రతా ఆంక్షలు విధించడంపై ప్రశ్నించారు. శుక్రవారం అర్ధరాత్రి సోషల్ మీడియా వేదికగా విడుదల చేసిన వీడియో సందేశంలో సీజేపీ నేత అభిజీత్ దీప్కే వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. తనను అరెస్టు చేసినా నిరసన ఆగకూడదని పిలుపునిచ్చారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే తమ పోరాటమని ప్రకటించారు. ప్రభుత్వ ఆంక్షలు, పోలీసుల చర్యల మధ్య నిరసనను కొనసాగిస్తామని సీజేపీ నేతలు స్పష్టం చేశారు. యువతను ఎందుకు పాకిస్థానీయుల్లా చూస్తున్నారని నిలదీశారు. నిరసనకారులను అడ్డుకోవడానికి దేశవ్యాప్తంగా నిర్బంధాలు, రవాణా ఆంక్షలు విధించడం అత్యవసర పరిస్థితిని తలపిస్తోందని ఆరోపించారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తనను అరెస్టు చేసినా, నిర్బంధించినా ఆందోళన ఆగకూడదని పిలుపునిచ్చారు. నిరసనకారులు శాంతియుతంగా వ్యవహరిస్తూనే తమ డిమాండ్ కోసం ఉద్యమాన్ని కొనసాగించాలని కోరారు. మరోవైపు, నిరసన నేపథ్యంలో జనపథ్-కర్తవ్య పథ్ కూడలి చుట్టూ నాలుగు కిలోమీటర్ల పరిధిలో ఇంటర్నెట్ సేవలను తాత్కాలికంగా నిలిపివేయడానికి కేంద్ర హోంశాఖ అనుమతించింది. అక్టోబర్ 9 రాత్రి 10 గంటల నుంచి అక్టోబర్ 10 రాత్రి 10 గంటల వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి.

# ఉప ఎన్నికల్లో అధికార పార్టీల హవా!

- **బెంగాల్‌లో బీజేపీ, తమిళనాడులో టీవీకే జోరు**

దేశవ్యాప్తంగా జరిగిన ఉప ఎన్నికల్లో అధికార పార్టీల ఆధిపత్యం స్పష్టమైంది. పశ్చిమ బెంగాల్‌లో నందిగ్రామ్, రెజీనగర్ అసెంబ్లీ స్థానాలను బీజేపీ భారీ మెజారిటీలతో కైవసం చేసుకుంది. నందిగ్రామ్‌లో హసి రాణి రాథ్ ఏకంగా 1.22 లక్షలకు పైగా ఓట్ల ఆధిక్యంతో గెలుపొందగా, రెజీనగర్‌లో శంకర్ రవ్ సర్కార్ 75 వేలకుపైగా ఓట్ల మెజారిటీ సాధించారు. మైనారిటీ ఓటర్లు అధికంగా ఉన్న ప్రాంతాల్లోనూ బీజేపీ విజయం సాధించడం ప్రాధాన్యం సంతరించుకుంది.



**మైనారిటీ ఓట్లపై బీజేపీ గురి**

రెజీనగర్‌లో సుమారు 70 శాతం, నందిగ్రామ్‌లో 27 శాతం మంది ముస్లిం ఓటర్లు ఉన్నట్లు సమాచారం. ఈ ప్రాంతాల్లోనూ తమ పార్టీకి మద్దతు లభించిందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి పేర్కొన్నారు. నందిగ్రామ్‌లో 80 శాతం మంది ముస్లింలు, రెజీనగర్‌లో 60 శాతానికి పైగా ముస్లింలు బీజేపీకి మద్దతిచ్చారని ఆయన వెల్లడించారు. ఈ విజయాలు ప్రజాస్వామ్యానికి నిదర్శనమని బీజేపీ పేర్కొంది. మంచి పాలన పట్ల ప్రజలకు ఎన్డీఏపై బలమైన విశ్వాసం ఉందని మోదీ వ్యాఖ్యానించారు.

**తమిళనాడులో టీవీకేకు రెండు సీట్లు**

తమిళనాడులో అధికార టీవీకే మదురాంతకం, ధారాపురం స్థానాల్లో విజయాలు సాధించింది. మదురాంతకంలో కే. మరగతం కుమరవేల్ 20,040 ఓట్ల మెజారిటీతో గెలవగా, ధారాపురంలో పి. సత్యభామ 9,471 ఓట్ల ఆధిక్యం సాధించారు. ఈ విజయాలతో 234 మంది సభ్యులున్న అసెంబ్లీలో టీవీకే బలం 109కు చేరింది. రెండు స్థానాల్లోనూ డీఎంకే రెండో స్థానంలో నిలవగా, అన్నాడీఎంకే మూడో స్థానానికి పరిమితమైంది. గతంలో అన్నాడీఎంకే ఎమ్మెల్యేలుగా ఉన్న అభ్యర్థులు టీవీకే తరఫున పోటీ చేసి గెలవడం విశేషం.

**అసోం, పుదుచ్చేరిలోనూ అధికార పక్షాలదే పైచేయి**

అసోంలోని నగావ్ లోక్‌సభ ఉప ఎన్నికలో దేవాశిష్ శర్మ 1.4 లక్షలకు పైగా ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఆల్ ఇండియా యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ నేత బద్రుద్దీన్ అజ్మల్ రెండో స్థానంలో నిలవగా, కాంగ్రెస్ అభ్యర్థి శివమణి బోరా మూడో స్థానానికి పరిమితమయ్యారు. పుదుచ్చేరిలోని తట్టాంచావడిలో అధికార ఏఐఎన్ఆర్సీ అభ్యర్థి 13,358 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. బెంగాల్‌లో ఖాళీ అయిన రెండు స్థానాలు, తమిళనాడులో రెండు స్థానాలు, పుదుచ్చేరిలో ఒక స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో అధికార పక్షాలు విజయాలు సాధించగా, నగావ్ ఫలితం బీజేపీకి రాజకీయ బలాన్ని చేకూర్చింది.



# 50 ఏళ్ల భూసమస్యకు పరిష్కారం!

### 1,301 మంది రైతులకు భరోసా



ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గంలోని గర్భకంద్రిక భూముల సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. సుమారు 50 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యకు పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపట్టారు. నర్సింగోలులో ఎనిమిది గ్రామాల రైతులతో సమావేశమైన ముఖ్యమంత్రి, వారి సమస్యలను స్వయంగా విని భూములపై హక్కులు కల్పించేందుకు చొరవ తీసుకున్నారు. దశాబ్దాలుగా తమ భూములపై స్పష్టమైన హక్కుల కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఈ నిర్ణయం ఊరటనిచ్చింది. ప్రభుత్వ చొరవతో తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందనే ఆశ రైతుల్లో నెలకొంది.2,915 ఎకరాలకు పట్టాల దిశగా అడుగులుకొండపి, జరుగుమిల్లి, నాగులుప్పలపాడు, సింగరాయకొండ మండలాల్లోని ఎనిమిది గ్రామాలకు చెందిన 1,301 మంది రైతులకు ప్రయోజనం చేకూరేలా 2,915.10 ఎకరాల భూముల సమస్యను పరిష్కరించేందుకు నిర్ణయం తీసుకున్నారు. సంబంధిత రైతులకు భూములపై హక్కులు కల్పిస్తూ పట్టాలు జారీ చేసేందుకు చర్యలు చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా సాగుతున్న నిరీక్షణకు ముగింపు పలికే దిశగా ప్రభుత్వం తీసుకున్న ఈ చొరవపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. తమ కష్టాలను స్వయంగా విని, పరిష్కారానికి ముందడుగు వేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.



# హైదరాబాద్‌లో రోడ్ కాంగ్రెస్ సదస్సుకు భారీ ఏర్పాట్లు!

### 3,000 మంది ప్రతినిధులు..

### 400 ఎగ్జిబిషన్ స్టాళ్లు

హైదరాబాద్‌లో నవంబర్ 19 నుంచి 22 వరకు హైటెక్స్‌లో నిర్వహించనున్న 85వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (IRC) సదస్సును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సచివాలయంలో సుమారు నాలుగు గంటలపాటు జరిగిన సమీక్షలో అతిథుల వసతి, రవాణా, ఆతిథ్యం, పర్యాటక ప్రాంతాల సందర్శనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా సుమారు 3,000 మంది ప్రతినిధులు హాజరుకానుండగా, 400 ఎగ్జిబిషన్ స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు. నవంబర్ 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారు. నవంబర్ 21న ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నారు. రహదారుల నిర్మాణంలో ఆధునిక సాంకేతికత, భద్రత, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై చర్చలు జరగనున్నాయి. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని మంత్రి సూచించారు.

# 100 శాతం స్ట్రైక్ రేటే లక్ష్యం

## స్థానిక సమరానికి జనసేన సన్నద్ధం!

## పవన్ కళ్యాణ్‌కు కానుకగా విజయం

### యల్లటూరు శ్రీనివాసరాజు వెల్లడి

రాజంపేట: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ 100 శాతం స్ట్రైక్ రేటుతో విజయాలు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని రాజంపేట పార్లమెంట్ జనసేన ఇన్‌చార్జ్ యల్లటూరు శ్రీనివాసరాజు స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల సమన్వయకర్తగా తనకు కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, ఎన్నికల్లో సాధించే విజయాలను పవన్ కళ్యాణ్‌కు కానుకగా అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ అప్పగించిన బాధ్యతను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పనిచేస్తానని పేర్కొన్నారు.క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపార్లమెంట్ స్థాయి సమన్వయకర్తల్లో తనకు ప్రాధాన్యత కల్పించి కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల యల్లటూరు శ్రీనివాసరాజు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను సవాలుగా తీసుకుని పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తానని చెప్పారు. పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ, ప్రజలకు మరింత చేరువయ్యేలా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ఎన్నికల్లో విజయాలు సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేస్తామని వెల్లడించారు. అధినేత తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.సమష్టి



కృషితో విజయమే ధ్యేయంస్థానిక ఎన్నికల్లో జనసేన విజయానికి పార్లమెంట్ సమన్వయ కమిటీలోని తోటి సమన్వయకర్తలు, నిర్వాహక దళ్ సభ్యులు, సపోర్ట్ టీమ్ నాయకుల సహకారం ఎంతో కీలకమని యల్లటూరు శ్రీనివాసరాజు పేర్కొన్నారు. అందరి సమష్టి కృషి, ఐక్యతతో ఎన్నికల వ్యూహాలను అమలు చేస్తామని తెలిపారు. పార్టీ శ్రేణుల మధ్య సమన్వయాన్ని పెంచుతూ, ప్రజా సమస్యలపై దృష్టి సారించి ముందుకు సాగుతామని విశ్వాసం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లో విజయపతాకం ఎగురవేసి పవన్ కళ్యాణ్ నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# ప్రొద్దుటూరుకు కొత్త బస్టాండ్..

### అభివృద్ధికి ఊతం



ప్రొద్దుటూరు ప్రజల నిరీక్షణకు తెరపడింది. పట్టణంలో నూతన ఆర్టీసీ బస్టాండ్‌ను రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలు ఇప్పటివరకు 100 కోట్ల ఉచిత బస్సు ప్రయాణాలు పూర్తి చేశారని వెల్లడించారు. రాష్ట్రానికి 750 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని, భవిష్యత్తులో ఏసీ బస్సులకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. పల్లె వెలుగు బస్సుల్లోనూ ఏసీ సౌకర్యం కల్పించే ఆలోచన ఉందన్నారు. మరోవైపు, ప్రొద్దుటూరు మున్సిపాలిటీ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.42 కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. పాత బస్టాండ్‌ను మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఐదు ఎకరాల స్థలంలో ఆధునిక స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తామని వెల్లడించారు. నూతన బస్టాండ్ అందుబాటులోకి రావడంతో ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కలగనున్నాయి. పట్టణ మౌలిక వసతులు, క్రీడా రంగం అభివృద్ధికి ప్రకటించిన ప్రణాళికలు అమలైతే ప్రొద్దుటూరుకు మరింత ప్రయోజనం చేకూరనుంది.

# డీజిల్ కూపన్ల కోసం కార్మికుల నిరసన



ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట చెత్త వాహనాలను నిలిపి కార్మికులు ఆందోళనకు దిగారు. పట్టణంలోని 52 వార్డుల్లో పారిశుద్ధ్య పనులకు ఉపయోగించే వాహనాలకు డీజిల్ కూపన్లు జారీ చేయడంలో జాప్యం జరుగుతోందని ఆరోపించారు. కమిషనర్ సంతకం కోసం ఎంతసేపు ఎదురుచూడాలని, డీజిల్ లేకపోతే వాహనాలు మధ్యలో ఆగిపోతే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. వాహనాల టైర్లు సరిగా లేకపోయినా విధులు నిర్వహిస్తున్నామని, మరమ్మతుల కోసం కొన్నిసార్లు సొంత డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో నిధుల కొరత ఉందని అధికారులు చెబుతున్నారని, పెట్రోల్ బంకు వ్యవహారంలో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపిస్తూ విచారణ కోరారు. సుమారు గంటపాటు నిరసన కొనసాగిన అనంతరం డీజిల్ కూపన్లు అందడంతో కార్మికులు వాహనాలకు ఇంధనం నింపించుకునేందుకు వెళ్లారు. దసరా ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో చెత్త సేకరణకు అంతరాయం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని కార్మికులు హెచ్చరించారు.

# విద్యార్థుల కోసం ఇస్కాన్ దసరా శిబిరం



ప్రొద్దుటూరులోని ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో అక్టోబర్ 10 నుంచి 21 వరకు 'గోపాల్ ఇస్కూల్' దసరా సాంస్కృతిక శిబిరం నిర్వహించనున్నారు. కొర్రపాడు రోడ్డులోని మందిరంలో ప్రతిరోజూ ఉదయం 9.45 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే శిక్షణలో 1-5, 6-10 తరగతుల విద్యార్థులకు వేర్వేరుగా బోధిస్తారు. మంత్ర ధ్యానం, భగవద్గీత శ్లోకాలు, నీతి బోధనలు, ఆటలు, నృత్యం ద్వారా ఆధ్యాత్మిక చింతన, నైతిక విలువలు, ఆత్మవిశ్వాసం పెంపొందించనున్నారు. ప్రవేశ రుసుము రూ.500. అక్టోబర్ 20న 50 మార్కులకు పరీక్ష నిర్వహించి, ప్రతిభావంతులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.6,000, రూ.3,000, రూ.1,000 అందజేస్తారు. మరో పది ప్రోత్సాహక బహుమతులు కూడా ఉంటాయి. అక్టోబర్ 25న బహుమతి ప్రదానోత్సవం నిర్వహిస్తారు. ఆసక్తిగలవారు 8520027510, 6303474393, 9912266036 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

# స్త్రీశక్తికి బస్సులు పెంచాలి

### ఉద్యోగాలు భర్తీ చేయాలి!



స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం మహిళల్లో ప్రభుత్వానికి ఆదరణ తెచ్చిపెట్టిందని, పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు, సిబ్బందిని పెంచకపోతే అదే పథకం ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తుందని ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర రావు హెచ్చరించారు. తిరుపతిలో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 4 వేల కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, ఖాళీగా ఉన్న 15 వేల పోస్టులను రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు ఆపరేటర్ల ద్వారా విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకించారు. ఆర్టీసీ సొంతంగా బస్సులు కొనుగోలు చేసి ఉద్యోగులతోనే నడపాలని, లేనిపక్షంలో జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. విద్యాధరపురం, గుంటూరు 2, నెల్లూరు 2, మంగళం డిపోలను పునఃప్రారంభించాలని, ఉద్యోగుల భద్రతా నిబంధనలు అమలు చేయాలని కోరారు. కాలం చెల్లిన టిమ్ యంత్రాల స్థానంలో కొత్తవి అందించాలని సూచించారు. విధుల్లో ఉన్న సిబ్బందిపై దాడులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. పెండింగ్ పదోన్నతులు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో కూరపాటి శంకర్ రెడ్డిని తిరుపతి జిల్లా గౌరవాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.



# ప్రొద్దుటూరులో వాసవి అమ్మవారి దసరా ఉత్సవాలు

ప్రొద్దుటూరు మెయిన్ బజార్ లోని అమ్మవారిశాలలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి 136వ దసరా మహోత్సవాలు అక్టోబర్ 11 నుంచి 21 వరకు ఘనంగా నిర్వహించనున్నారు. ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్ రావు ఉత్సవాల వివరాలను వెల్లడించారు. తొలిరోజు 102 మంది సువాసినులు కలశాలతో ఊరేగింపుగా బయలుదేరి, నవగంగ తీర్థాలు, అమ్మవారి పురాణాన్ని తీసుకురానున్నారు. పాలకొల్లు బ్యాండ్, కర్ణాటక కళాకారుల బొమ్మల ప్రదర్శన, నృత్య తరంగిణి ప్రదర్శనలు, కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. అక్టోబర్ 17న మూలా నక్షత్రం సందర్భంగా బిందె సేవ గ్రామోత్సవం నిర్వహిస్తారు. విజయదశమి రోజైన 20న శమీ దర్శనం, తొట్టి మెరువని, సన్నాయి, డ్రమ్స్, రేలా రే రేలా, డ్రోన్, బాణసంచా, ఎల్ ఈడీ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. చివరి రోజైన 21న ఉదయం 6.30 గంటలకు తప్పెట్ల ప్రదర్శనతో గ్రామోత్సవం జరుగుతుంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆర్యవైశ్య సభ ప్రతినిధులు కోరారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# ప్రొద్దుటూరు మున్సిపల్ పీఠంపై జై భారత్ గురి



